క్లుప్తంగా

రాయితీతో వైద్యసేవలు


దంత పరీక్షలు చేస్తున్న ఉమ్రాన్

నెల్లూరు(అర్బన్) : తమ ఆస్పత్రి స్థాపించి 15వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాయితీతో కూడిన దంత వైద్యసేవలు అందిస్తామని ఆయుష్ దంత వైద్యశాల డాక్టర్ ఉమ్రాన్ అన్నారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఆయుష్ దంత వైద్యశాలలో శనివారం రాయితీతో కూడిన సేవలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఇంప్లాంట్స్‌తో సహజసిద్ధమైన పళ్లను ఏర్పాటు చేయడం, ఫిక్స్‌డ్ కట్టుడు పళ్లు, రూట్‌కెనాల్, దవడ ఆపరేషన్‌లు, ఆధునిక క్లిప్స్ ఇలా అన్ని సేవలను అందిస్తామన్నారు. పత్రికలో ఇచ్చిన యాడ్ క్లిప్ చూపిన వారికి ఈనెల 28 వరకు 50 శాతం రాయితీతో సేవలందిస్తామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని కోరారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశం అనంతరం ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో యూపీ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం అందజేయాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, అరియర్స్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునీర్‌జాన్, కోశాధికారి యానాదిరెడ్డి, ఉపాధ్యక్షుడు దేవరాజ్, భాస్కర్ నారాయణ, వెంకటేశ్వర్లు, సాయిరెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో వార్షికోత్సవ వేడుకలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో 28వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పూర్వ విద్యార్థిని, విశ్రాంత అధ్యాపకురాలు కుసుమకుమారి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా రూ.లక్ష ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు, విడవలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దీన్‌దయాళ్, మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, డీకేడబ్ల్యూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, చంద్రకళ, కరుణకుమారి, శ్రీదేవి, ప్రసన్న, భారతి, సమత, శివయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎన్నార్ విద్యార్థి ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నాగచైతన్య

నెల్లూరు (టౌన్) : నగరంలోని కేఎన్నార్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి నాగచైతన్య ఎడ్యుకేషన్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ ఇటీవల నిర్వహించిన మెరిట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజయవాడలో సంస్థ నిర్వాహకులు శనివారం విద్యార్థి నాగచైతన్యకు బహుమతిని అందజేశారు.

ప్యానల్ బోర్డులో మంటలు

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని ఓ భవనానికి విద్యుత్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డులో మంటలు చెలరేగింది. రూరల్‌లోని గాంధీనగర్ నుంచి డైకస్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో ఓ ప్రైవేటు భవనం వద్ద పవర్ సప్లై అయ్యే ప్యానల్ బోర్డు వద్ద శనివారం మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. స్థానికులు వెంటనే విద్యుత్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

మహాకుంభమేళాకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం 4 గంటలకు మహాకుంభమేళా జరిగే ప్రయాగ్‌రాజ్, కాశీయాత్రకు బయలుదేరింది. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ, ఇతర సిబ్బంది జండా ఊపి ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- విశేషాలంకారాల్లో స్వామివారి దర్శనం


వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో..


రంగనాథుడికి బంగారు గరుడసేవ


ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో విశేషాలంకారంలో స్వామి, అమ్మవారు

నెల్లూరు(బృందావనం) : భీష్మ ఏకాదశి సందర్భంగా స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో రమాదేవి వీరవెంకట సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రణమిల్లారు. వ్రతంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు అన్నవరం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వెండి డాలరు, రవ్వ పొంగలిని ప్రసాదంగా వితరణ చేశారు. అనంతరం సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు శుభమస్తు షాపింగ్ మాల్ వారు బ్యాగ్స్ అందజేశారు.

పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

రంగనాయకులపేటలోని సోమిశెట్టి కల్యాణ మండపంలో నెల్లూరు పినాకినీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని శనివారం నిర్వహించారు. వంద మంది దంపతులకు పైగా పాల్గొని, ప్రత్యేక పూజలు, వ్రతం ఆచరించారు. నుడా మాజీ చైర్మన్, ఆర్యవైశ్య నేత ముక్కాల ద్వారకానాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేషాద్రి సుధీర్, మెంటా శరత్, చైర్మన్ లీలాధర్‌రెడ్డి, కార్యదర్శి బాల ప్రసన్నకుమార్, పేర్ల జనార్దన్‌రావు, శరత్, ప్రోగ్రామ్ చైర్మన్ ఐతా అనిల్‌సాయికుమార్, శ్రీరామ్ సూర్యనారాయణ, మొగిలి సందీప్ పాల్గొన్నారు.

వైభవంగా బంగారు గరుడసేవ

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, రాత్రి స్వర్ణ గరుడసేవ (బంగారు గరుడసేవ), పేట ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా తంగిరాల వెంకటసుబ్బయ్య వారసులు వ్యవహరించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు సిటీ : భీష్మ ఏకాదశి సందర్భంగా రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామికి స్నపన తిరుమంజనం, గీతా పారాయణం, వేద పారాయణం జరిగింది. అనంతరం లక్ష తులసీదళ పూజ, కుంకుమార్చన, పూర్ణాహుతి, కల్యాణం, గిరిప్రదక్షిణ మహోత్సవ కార్యక్రమాలు అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో జరిగాయి. ఉభయకర్తలుగా ఈశ్వరమ్మ, చెన్నారెడ్డి సునీత, గిరి, జక్కా వెంకటేష్‌రెడ్డి వ్యవహరించారు. అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


సోమిశెట్టి కల్యాణ మండపంలో..


సామూహిక వ్రతంలో దంపతులు

హక్కులను కాపాడుకుందాం



నెల్లూరు సిటీ : ప్రతిఒక్కరి సహకారంతో మానవ హక్కులకు కాపాడుకుందామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్(ఐహెచ్‌ఆర్‌పీసీ) స్టేట్ చీఫ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇంతియాజ్ అన్నారు. నగరంలోని బట్వాడుపాళెం సెంటర్‌లో ఉన్న ఏఎఫ్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఐహెచ్‌ఆర్‌పీసీ స్టేట్ చీఫ్ జనరల్ సెక్రటరీగా ఇంతియాజ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సన్మానించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌పీసీ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ హెచ్‌ఎండీ ముజాహిద్, చైర్మన్ ఫరాష్ షోయబ్ రెహ్మాన్, వైస్ ప్రెసిడెంట్ సుహైల్, జనరల్ సెక్రటరీ ప్రశాంతి, నేషనల్ అడ్వైజర్ షరీఫ్ హుస్సేనీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి


స్పెషల్ కలెక్టర్ రవిచంద్రతో అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, ఎనర్జీ సెక్రటరీ విజయానంద్, విజిలెన్స్ జేఎండీ కీర్తి, సీపీడీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీ భాస్కర్, సీఎం కార్యాలయ స్పెషల్ కలెక్టర్ రవిచంద్రలను విజయవాడలో కలిసి అసోసియేషన్ డైరీలు, క్యాలెండర్లను అందజేశారు. అలాగే జేఎల్‌ఎం గ్రేడ్-2లను రెగ్యులరైజ్ చేయాలని, ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని, విద్యుత్ ఉద్యోగులు ప్రమాదాల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని వంటి పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్తాఫ్, అధ్యక్షుడు బాషా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఖాదర్‌బాషా, యూనియన్ నాయకులు అలీబేగ్, అబ్బాస్, నవాబ్ జానీ, రియాజ్, ఖాదర్‌బాషా, నస్రుల్లా తదితరులు ఉన్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేయాలి


మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యుడు

నెల్లూరు సిటీ : గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఏడాది రెండు సార్లు ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలల్లో హెడ్ కౌంట్ సర్వే నిర్వహించాలన్నారు. గర్భిణులు, చిన్నారులను గుర్తించి, వారికి ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి విరాళం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక డైకస్ రోడ్డులో ఉన్న వియాని హోమ్ (దివ్యాంగుల ఆశ్రమం) నిర్వాహకులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెజవాడ సునీల్‌రెడ్డి, రాఘవేంద్ర శెట్టి, పొన్నం రవిచంద్ర, రాజా రమేష్‌లు రూ.20 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేందర్‌రెడ్డి, కోశాధికారి గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎంఎస్ రెడ్డి, డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, సుబ్బరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


జాకీర్‌హుస్సేన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్‌హుస్సేన్‌ను నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పిలుపునిచ్చారు. జాకీర్‌హుస్సేన్ జయంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, గవర్నర్‌గా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పనిచేసి భారతరత్న లాంటి గొప్ప పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. నేటి యువత ఆయన జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని సమాజంలో లౌకికతత్వం కోసం పనిచేయాలని కోరారు. విభిన్న కులాలు, మతాలు, సంస్కృతుల కలయికే భారతదేశమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతోన్మాద సంస్థలు రెచ్చిపోతున్నాయన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ, సీపీఎం నాయకులు రియాజ్, చాన్‌బాషా, రవూఫ్, రియాజ్, ఉస్మాన్, దస్తగిరి, మహబూబ్‌బాషా, మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు

- తాగునీరు లేకపోవడంపై ఆగ్రహం


మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) కో-ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యుడు మొగరాల సురేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీహెచ్ బ్లాక్‌లో గతంలో దాతలిచ్చిన ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైనట్లు తెలుసుకున్నారు. అలాగే వారధి ఫౌండేషన్ సమకూర్చిన ఆర్వో ప్లాంటు గత కొన్ని రోజులుగా పని చేయకపోవడం, శుక్రవారం మరమ్మతులు చేయిస్తే శనివారానికి లీకేజీ కావడంతో సంబంధిత బాధ్యులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఐపీ బ్లాకులో సైతం ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైనట్టు తెలుసుకుని తక్షణమే ఆ ప్లాంటును రన్నింగ్‌లో తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్లాంట్ నుంచి వివిధ అంతస్తులకు వచ్చే పైపులైన్‌లను పరిశీలించారు. ఆస్పత్రి అధికారులు నిధులను విడుదల చేయడంలో జాప్యం చేయడంతో తమ సొంత నిధులతో ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్వో ప్లాంటు నిర్వహణ బాధ్యుడు ప్రదీప్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి


ఆదాల ప్రభాకర్‌రెడ్డితో ఆనం విజయకుమార్‌రెడ్డి, జిల్లా కమిటీ ప్రతినిధులు

నెల్లూరు(బృందావనం) : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కమిటీ ప్రతినిధులు, రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారు ఆదాలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. అనంతరం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బృందావనం) : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారు చింతారెడ్డిపాళెంలోని ఆనం విజయకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను కూడా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని వారు వెల్లడించారు.

రాష్ట్రంలో పెరగనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు

నెల్లూరు (టౌన్) : రాష్ట్రంలో ఐదు రకాల పాఠశాలల వ్యవస్థ ద్వారా ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశం ఉందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు చదవడం, రాయడం కూడా రావడం లేదని, ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ స్కూల్స్ ద్వారా భవిష్యత్తులో 20 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే అవకాశం ఉందన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని వెంగళరావునగర్‌లో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి రీనా భారతి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దంత, చర్మ సంబంధమైన వ్యాధులు సాధారణంగా వస్తుంటాయని, శారీరక ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే వాటిని దూరం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి తాళ్లపాక మస్తానయ్య, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్‌ట్యాంక్

నెల్లూరు(బృందావనం) : జెండావీధిలోని వాటర్‌ట్యాంక్ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముస్లిం యువసేన కమిటీ అధ్యక్షుడు ఖాలిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జెండావీధి సెంటర్‌లోని లైబ్రరీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారాయణ మూడునెలల్లో బాగు చేస్తామని చెప్పారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.